

శ్రీశ్రీశ్రీ సద్గురు భం భం బాబా వారి 57 వ

మరియు

శ్రీశ్రీశ్రీ సద్గురు భం అన్వరానంద స్వామి వారి 23 వ

# ఆరాధన మహోత్సవాల సందర్భంగా

# భం గురువాణి

## ప్రత్యేక సంచిక

## యుగధర్మం

నేటి సమాజంలో ఎక్కడ చూసినా అన్యాయం అధర్మం వంచన పెరిగిపోయాయి, దీనికి కారణం యుగధర్మమా, కాలమహిమా లేక కాల ప్రభావమా ఏమని వర్ణించుదాము. కలికాలం యొక్క ప్రభావం పూర్తిగా పెరిగిపోయింది నేటి సమాజంలో కలి యొక్క ప్రభావం ద్వాపరయుగం యొక్క అంతిమ కాలంలోనే మొదలయ్యింది, దీనికి ఒక చక్కటి ఉదాహరణ చెబుతాను చూడండి.

ధర్మరాజు రాజ్యపాలన చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి మాకు న్యాయం చేయాలి మహారాజా అని అడుగుతారు, వారిద్దరిలో ఒకరు రైతు మరొకరు బ్రాహ్మణుడు. రైతు అంటాడు ఈయన దగ్గర ఒక ఎకరా మెట్ట భూమి నేను కొన్నాను. కొన్న తర్వాత దానిని దున్నే సమయంలో అందులో ఒక నిధి దొరికింది నాకు, నేను ఆయన వద్ద భూమి కొన్నాను కానీ నిధిని కొనలేదు, కనుక ఈ నిధిని ఆయనకే ఇప్పించండి మహారాజా అని అంటాడు రైతు. బ్రాహ్మణోత్తమ మీ ఫిర్యాదు ఏమి అంటే ఆయన అంటాడు మహారాజా నా కష్టాల వల్ల నేను ఒక ఎకరా భూమిని ఆయనకు అమ్మినాను, అమ్మిన తర్వాత ఆ భూమి పైన సర్వహక్కులు ఆయనకే ఉంటాయి, దాంట్లో నిధి దొరికిన ఇంకేమి దొరికినా దానికి యజమాని

ఆయనే అవుతాడు, కాబట్టి ఆ నిధిని ఆయనకే ఇప్పించండి అని అంటాడు. ఈ మాటలు విని ధర్మరాజుకు పరమానందం అవుతుంది, ఎటువంటి నీతి బద్ధమైన మనుషులు ఉన్నారు కదా అని అనుకుంటాడు.

అయితే ఏ రీతిగా ఈ సమస్యను పరిష్కారం చేయాలి అని ఆలోచన చేస్తూ ఉంటాడు, ఆ సందర్భంలో శ్రీకృష్ణ పరమాత్మ వైపు ధర్మరాజు చూడగా శ్రీకృష్ణుడు ఈ విధంగా సలహా ఇస్తాడు నాయనలారా మీ నిధిని రాజవశం చేయండి, మూడు నెలల తరువాత రండి పరిష్కారం చేస్తాము అని చెప్పి వారిని పంపివేస్తారు .మళ్ళీ మూడు నెలల తర్వాత ధర్మరాజు దగ్గరికి వాళ్లు వస్తారు, విచారణ ప్రారంభమవుతుంది .అక్కడ శ్రీకృష్ణ పరమాత్మ కూడా కూర్చొని ఉంటాడు. అప్పుడు ధర్మరాజు రైతును అడుగుతాడు ఇప్పుడు ఏమి చెప్తారు మీరు? నేను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాను అంటాడు.

అప్పుడు ఆ రైతు అంటాడు రాజా ఆ బ్రాహ్మణుని దగ్గర ఒక ఎకరా భూమి నేను కొన్నాను, దీని అర్థం ఏమి ఆ భూమిలో ఉన్నటువంటి అన్నింటి మీద సర్వహక్కులు నావే కదా, అందులో నిధి దొరికింది అంటే దానిపై హక్కు నాకే ఉంటుంది కానీ ఆ బ్రాహ్మణునికి కి హక్కు ఎలా ఉంటుంది. అందుకు బ్రాహ్మణుడు అంటాడు మహారాజా భూమి ఆయనకు అమ్మినాను కానీ అందులోని నిధిని అమ్మలేదు కదా నేను, నిధి అందులో ఉంది అని తెలిసి ఉంటే అసలు అమ్మే వాడిని కాదు, ఇప్పటికే నాకు కష్టాలు ఎక్కువగా

ఉన్నాయి కాబట్టి దయచేసి ఆ నిధిని నాకే ఇప్పించండి. ధర్మరాజుకు ఆశ్చర్యమవుతుంది కొద్దికాలం క్రితం ఆ నిధి వద్దు అన్న వాడు ఇప్పుడు నాకే కావాలి అంటున్నాడు, మూడు నెలల క్రితం వీళ్ళు ధర్మ సంబంధమైన గుణంతో వెలసిల్లినారు, ఇప్పుడు ఎంత అధర్మంగా మాట్లాడుతున్నారు అని అనుకొని ధర్మరాజు శ్రీకృష్ణుని వైపు తిరిగి కృష్ణా దీనికి నీవే పరిష్కారం చెప్పాలి అని అడుగుతాడు. అందుకు శ్రీకృష్ణుడు అంటాడు చూడండి ప్రకృతిలో దొరికినటువంటి వస్తువు ఏదైనా కానీ ప్రజలందరూ సమానంగా పంచుకోవాలి కాబట్టి ఆ నిధిని రాజు యొక్క ఖజానాకు ఇవ్వండి దానిమీద మీ ఇరువురికి హక్కు లేదు కనుక మీరు వెళ్ళిపోండి అంటారు. వాళ్ళు ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోతారు

అప్పుడు ధర్మరాజు "శ్రీకృష్ణ వీళ్ళల్లో ఈ మార్పు ఎలా వచ్చింది" ? దీనికి సమాధానంగా శ్రీకృష్ణుడు అంటాడు కాల ప్రభావం, కలికాలం ప్రారంభమైంది. ఇప్పటినుండి ధర్మగుణం నశిస్తుంది అధర్మం ఎక్కువైపోతుంది అని చెబుతాడు. ఇక్కడ అధర్మానికి నాంది పలుకుతుంది అని చెప్పవచ్చు, దీనినే యుగధర్మం అని అంటారు.

కనుక శిష్య భక్తాదులారా ఇది కలికాలం ఇక్కడ అధర్మం అన్యాయం రాజ్యమేలుతున్నాయి కనుక మీరందరూ కూడా చక్కటి ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించి న్యాయం ధర్మం వైపు నిలబడగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.